క్లుప్తంగా

బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా రాజేందర్



కేసముద్రం: హైదరాబాద్‌లోని కోటాక్ పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమిలో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న కోటాక్ ఇండియా జూనియర్ ఇంటర్ నేషనల్ సిరీస్–2025, బ్యాడ్మింటన్ ఛాంపియన షిప్ పోటీలకు అంపైర్‌గా కేసముద్రం స్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.జితేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకులంలో స్పాట్ కౌన్సెలింగ్

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ట్రైబల్ గురుకుల పాఠశాలలో మిగిలిపోయిన ఖాళీ సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ ఈనెల 19న కొత్తగూడ మండలం గిరిజన బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ట్రైబల్ గురుకులాల ఆర్సీఓ రత్నకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్ ఐదో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నామని, గతంలో ప్రవేశ పరీక్ష రాసి ఉన్న విద్యార్థుల హాల్ టికెట్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా ఉర్సు

గార్ల: గార్ల సమీపంలోని రజాలిబేగ్ దర్గా వద్ద ఉర్సు వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దర్గాలో స్థానిక ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా రజాలిబేగ్‌ను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా వద్ద భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

గుంతలమయమైన రహదారి



రోడుపై ఏర్పడిన గుంతలు

నెల్లికుదురు: రహదారంతా గుంతలమయమైనా అధికారులు పట్టించుకోవడంలేదు. నెల్లికుదురు నుంచి ఇనుగుర్తి మండల కేంద్రం వరకు సుమారు 11కిలో మీటర్ల ప్రధాన రహదారంతా గుంతలమయమై ప్రయాణం నరకయాతనగా మారింది. హనుమాన్‌నగర్ తండా వద్ద గుంత పడి నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

గత నిధులతో అభివృద్ధి చేయండి

ఖానాపురం: గత బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసిన నిధులతో నర్సంపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. మండలంలోని పాకాల మత్తడి, కట్ట మైసమ్మ వద్ద శనివారం ఆయన ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల కబ్జాలు, అవినీతి, అక్రమాలు భారీగా పెరిగిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే మాధవరెడ్డికి అవసరమైన పనులకే టెండర్లు వేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కొండవీటి ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వరుస వానలు.. చిగురిస్తున్న ఆశలు

- చెరువులు, బావుల కింద జోరందుకున్న వరినాట్లు



కొత్తూరు వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

కురవి: సీరోలు, కురవి మండలాల్లోని చాలా గ్రామాల్లో వరుసగా వర్షాలు కురుస్తుండడంతో చెరువులు, కుంటల్లోకి వరదనీళ్లు వచ్చి చేరుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వర్షాకాలంలో చెరువులు, కుంటల కింద వరిపంటను సాగు చేయాల్సిన రైతులు ఇప్పటి వరకు బావుల కింద వరిసాగును పూర్తి చేసే దశకు చేరుకున్నారు. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో చెరువులు, కుంటలు నిండే పరిస్థితి కనిపిస్తుండడంతో రైతులు వాటి కింద వరిసాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో వరినాట్లు జోరందుకున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో చెరువుల కింద వరిసాగు చేసేందుకు వరినారును పెంచుతున్నారు. కురవి, సీరోలు మండలాల్లో ఇప్పటి వరకు 23 చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. మండలంలో 2023–2024 సంవత్సరంలో 12,906 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ ఏడాది 12,653 ఎకరాల్లో వరిసాగు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏఓ నరసింహరావు తెలిపారు. సీరోలు మండలంలో 2024లో 7,777 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ ఏడాది 8వేల ఎకరాల్లో వరిసాగు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏఓ చాయారాజ్ తెలిపారు. కురవి, సీరోలు మండలాల్లోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ బావులు, చెరువుల కిందనే వరి సాగును చేపట్టారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఈనెల 25, 26 తేదీలలో మహబూబ్‌నగర్‌లో జరగనున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాయం చిన్న చంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మహాసభల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని, రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. రైతాంగ సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందించి పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో పూనెం ప్రభాకర్, ఆవుల కట్టయ్య, ఊడుగుల రాములు, గద్దల వెంకటయ్య, కురుసం రంగయ్య, కంగాల పాపయ్య, బూర్గుల మోష, తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న అశోక్

తొర్రూరు: బీజేపీ మతతత్వ రాజకీయాలను ఎండగట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లం అశోక్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శి ఎండీ యాకూబ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అశోక్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోందని, కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతుందన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో తొర్రూరులో జరిగే సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డొనక దర్గయ్య, జమ్ముల శ్రీను, నాగన్న, సోమిరెడ్డి, తాళ్ల వెంకటేశ్వర్లు, సాయిమల్లు, ఉమ్మగాని యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుగ్యాల సేవలు చిరస్మరణీయం

తొర్రూరు: మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు నియోజకవర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ అన్నారు. దుగ్యాల జయంతిని పురస్కరించుకుని శనివారం డివిజన్ కేంద్రంలో ట్రస్టు నిర్వాహకులు వెల్తూరి మల్లేశం, మిట్టకోల లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రామసహాయం కిశోర్‌రెడ్డి, సుంచు సంతోష్, అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

పెద్దవంగర: మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తగా ఉండాలని తహసీల్దార్ మహేందర్, ఎంపీడీఓ వేణుమాధవ్ సూచించారు. శనివారం మండలంలోని పలు చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 37 చెరువులు, కుంటలు ఉండగా బొమ్మకల్లు, చిట్యాల, వడ్డెకొత్తపల్లి, కొరిపల్లి, చెరువులు సహా అనేక కుంటలు అలుగులు పారుతున్నాయని తెలిపారు. జిల్లాకు ప్రభుత్వం రెడ్ అలెర్ట్‌గా జారీ చేసిందన్నారు. వాహనాలు, నెమ్మదిగా నడపాలని, చెట్లు, శిథిల భవనాలు, వాగులు వంకలు, చెరువుల వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు. రైతులు విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచించారు.

ఎస్సారెస్పీ కెనాల్ పనులు పూర్తి చేయాలి



ఆందోళన చేస్తున్న గిరిజన వాసులు

మరిపెడ రూరల్: అసంపూర్తిగా ఉన్న ఎస్సారెస్పీ ఉపకాల్వ పనులను వెంటనే పూర్తి చేసి, కెనాల్ నుంచి గృహాల్లోకి వస్తున్న వరదనీరు, విష పురుగులను నియంత్రించాలని మండలంలోని పాంబండతండా వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పాంబండతండా గృహాల మధ్య నుంచి పారుతున్న మురుగు వరద నీటిలో నిలబడి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సాగు జలాల కోసం మండలంలోని బుర్హాన్‌పురం నుంచి తాళ్లఊకల్ వరకు పాంబండతండా గృహాల వెంబడి గత 9ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ ఉపకాల్వను తవ్వారు. కానీ తండాలో అజ్మీర బాలాజీ అనే వ్యక్తి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం సరిపోదని తండా వద్ద తన భూమిలో సుమారు 10మీటర్ల పొడవు కాల్వ పనులను చేయకుండా అడ్డుకుని ఆపాడు. అప్పటి నుంచి తొమ్మిదేళ్లుగా కాల్వ అసంపూర్తిగా ఉండి వర్షాకాలం వరద నీటికి నిండుకుని గృహాల మధ్య నుంచి మురుగు నీరు ప్రవహిస్తుంది. ఈ నీటి ద్వారా విషపురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వరద కింద సాగు చేస్తున్న సుమారు 10ఎకరాలు ఏటా నష్టం జరుగుతుందని బాధిత రైతులు వాపోయారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ ఏఈ, డీఈలకు విన్నవించిన వారు అప్పటి నుంచి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన కాల్వ సమస్యలను పరిష్కరించకపోతే రోడ్డుపై బైటాయించి ఆందోళన మరింత ఉధృతం చేస్తామని బాధితులు భూక్య రవి, మాలోతు బాబు, మంగ్యా, జామ్లా, చిన్న, మాలోతు రవి, సూక్యా, కిషన్ హెచ్చరించారు.

ఎడ్జెర్ల పెద్ద చెరువు కరకట్టకు నెర్రెలు



ఎడ్జెర్ల పెద్ద చెరువు కరకట్ట నెర్రెలను పరిశీలిస్తున్న అధికారులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామ పెద్ద చెరువు కరకట్ట నెర్రెలు బారింది. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంఘన స్థలానికి చెరుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. శనివారం తొర్రూరు ఆర్డీఓ గణేష్, మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి, ఇరిగేషన్ డీఈ రాజ్‌కుమార్, ఏఈ శ్రీకాంత్ పెద్ద చెరువు వద్దకు చేరుకుని నెర్రెలు బారిన కరకట్టను పరిశీలించారు. గత ఏడాది భారీ వర్షాల కారణంగా కరకట్ట తెగిపోయిందని, తెగిన చోట మళ్లీ పగుళ్లు వచ్చాయన్నారు. అయితే గతంలో ఓ రోడ్డు కాంట్రాక్టర్ తాత్కాలిక మరమ్మతులు చేశాడన్నారు. ఈక్రమంలో మే నెలలో కరకట్ట మరమ్మతులకు రూ.49.50లక్షలు నిధులతో పనులు మంజూరు అయినట్లు తెలిపారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టిన మూడు రోజులకే వర్షాలు మొదలు కావడంతో పనులు మధ్యంతరంగా నిలిచాయన్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి చెరువు కరకట్ట పునరుద్ధరణ పనులపై చర్యలు తీసుకోవాలని ఎడ్జెర్ల గ్రామస్తులు డిమాండ్ చేశారు.

శిలాఫలకం ధ్వంసం

కురవి: మండలంలోని రాజోలు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకంను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. శనివారం ధ్వంసమైన శిలాఫలకాలను వర్షంలో తడుస్తూ బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో పోతుల రామ్మూర్తి, బస్వవీరేష్, రాజగోళ్ల సత్యనారాయణ, నల్ల ఉపేందర్, పోచారపు నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణాష్టమి వేడుకల శనివారం ఘనంగా నిర్వహించారు. ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఉత్సహంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: రాధాకృష్ణుల వేషధారణల్లో చిన్నారులు



చిన్నగూడూరులో..



కురవి: ఉట్టి కొడుతున్న యువకులు



కొత్తగూడ: శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



బయ్యారం: రంగాపురం బొడ్రాయి సమీపంలో..



గార్ల: కృష్ణుడి వేషధారణలో చిన్నారి



మహబూబాబాద్ రూరల్: కృష్ణుడి వేషధారణలో చిన్నారి



కురవి: సీరోలు మండల కాంపల్లిలో చిన్నారులు..



నెల్లికుదురు ఇనుగుర్తి మండలం చిన్ననాగారం స్తంభం ఎక్కుతున్న యువకులు

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పెద్దవంగర: మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల సంపత్ (35) ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలిసిన 2009–10 బ్యాచ్ చిన్ననాటి స్నేహితులు రూ.21వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో హరిశంకర్, అసలంత్ పాషా, శ్రీకాంత్, రాజు, నవీన్, అశోక్, కుమారస్వామి పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండల కేంద్రంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు హెచ్.భిక్షం(70) కుటుంబానికి గ్రామ పంచాయతీ తరఫు నుంచి దహన సంస్కారాల కోసం పంచాయతీ కార్యదర్శి రాజేష్ రూ.10వేల ఆర్థికసాయం అందజేశాడు.

విద్యుదాఘాతంతో గుర్రం మృతి

మహబూబాబాద్ రూరల్: విద్యుదాఘాతంతో గుర్రం మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారు చంద్రుతండాలో శనివారం చోటుచేసుకుంది. తండాకు చెందిన బానోత్ వెంకన్న తాను పెంచుకుంటున్న గుర్రాన్ని మేతకు తీసుకెళ్లాడు. అక్కడ పడి ఉన్న విద్యుత్ తీగకు గుర్రం తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు విలపించాడు.

మానుకోటకు తరలిన గౌడ కులస్తులు

కురవి: జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సభ కోసం కురవి, సీరోలు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి గౌడ కులస్తులు శనివారం తరలివెళ్లారు. కార్యక్రమంలో గోపా మండల అధ్యక్షుడు బాలగాని నవీన్ కుమార్‌గౌడ్, పెద్ది అనిల్ గౌడ్, బాలగాని శ్రీనివాస్, దయ్యాల శ్రీధర్, కత్తి వీరన్న పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకం అందజేత

మరిపెడ రూరల్: మరిపెడ మండలం రాంపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత ఏడాది ఎస్సెస్సీలో ప్రతిభ కనబర్చిన పోలేపాక చరణ్, కొండ భాను విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన దాత కొమ్ము చంద్రశేఖర్ ఒకొక్కరికి రూ.1000 చొప్పున నగదు ప్రోత్సాహాన్ని శనివారం అందజేశాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెద్దవంగర: కుటుంబ భవిష్యత్ కోసం నగరంలో వలస జీవితం సాగిస్తున్న ఓ మహిళ దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన హైదరాబాద్‌లో జరిగింది. మండలంలోని కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన తండాల మంజుల (38) భర్త సమ్మయ్య దంపతులు జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులతో కలసి వలస వెళ్లి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వెనుకనుంచి వేగంగా దూసుకొచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆమె తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది.

రోడ్డుపై విరిగిపడిన చెట్టు

గంగారం: మండలంలోని మడగూడెం క్రాస్ రోడ్డు వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి చెట్టునేల వాలింది, దీంతో స్పందించిన ఎస్సై రవికుమార్, మడగూడెం మాజీ సర్పంచ్ చుంచ వెంకటలక్ష్మీ , గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి చెట్టును తొలగించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు.

రోడ్డు కిందికి దూసుకెళ్లిన లారీ

దంతాలపల్లి: మండల కేంద్రంలో శనివారం ఉదయం ఓ లారీ రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఖమ్మం నుంచి లోడుతో వరంగల్ వైపు వస్తున్న క్రమంలో అదుపు తప్పి రోడ్డు కిందికి లారీ దూసుకెళ్లింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

కాంగ్రెస్ హయాంలోనే పేదల అభివృద్ధి

ఖానాపురం: కాంగ్రెస్ హయాంలోనే పేదలు అభివృద్ధి చెందుతారని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరగా వారికి హరిబాబు, జగన్‌మోహన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం హరిబాబు, జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు.

జోరు వానలు.. నిండిన చెరువులు



బయ్యారం: రహదారిపై ప్రవహిస్తున్న జిన్నెలవర్రె నీరు



చిన్నగూడూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న జిన్నెలవాగు



గూడూరు: చెంద్రుగూడెంలో ఓ ప్రధాన వీధి



కురవి: అలుగుపోస్తున్న నేరడ పెద్ద చెరువు

సాక్షి నెట్‌వర్క్: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బయ్యారం మండలంలోని పలు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పందిపంపుల ప్రవాహంతో సుద్దరేవు–కంబాపల్లి గ్రామాల నడుమ ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో ఆ రెండు గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామంలో గల పెద్దచెరువు అలుగుపోస్తూ జలకళను సంతరించుకుంది. గూడూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండుకొని అలుగులు పోస్తున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెంద్రుగూడెంలోని ఓ ప్రధాన రహదారి నీటితో నిండుకుండలా నిండుకుంది. గార్ల సమీపంలోని పాకాల ఏరు గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెక్‌డ్యాం పైనుంచి పొంగి ప్రవహిస్తోంది. శనివారం పాకాల ఏరు వరద ఉధృతిని అధికారులు పరిశీలించారు. కురవి మండలంలోని నేరడ పెద్ద చెరువు భారీగా కురుస్తున్న వర్షాలకు అలుగుపోస్తోంది.

కమ్యూనిస్టులతోనే సమస్యల పరిష్కారం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

తొర్రూరు: కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతి, సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్ అన్నారు. ఈనెల 20నుంచి 22వరకు హైదరాబాద్‌లో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లను శనివారం డివిజన్ కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గణపురం లక్ష్మణ్, ముద్రబోయిన వెంకన్న, వీరన్న, వెంకన్న, కుమార్, మల్లయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.